అధునాతన వసతులతో హిందూ శ్మశానవాటిక

- రూ.1.98 కోట్లతో గోదావరి గట్టున నిర్మాణం
- ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం



అధునాతన వసతులతో నిర్మించిన హిందూ శ్మశానవాటిక షెడ్డు

నరసాపురం: గోదావరిగట్టున కొండాలమ్మగుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ 1.98 కోట్లుతో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటిక నిర్మాణం పూర్తి చేశారు. దీంతో దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారమైంది. పట్టణంలో ప్రధానమైన ఈ శ్మశానవాటిక గతకొంత కాలంగా అధ్వానంగా తయారైంది. గత మున్సిపల్ పాలకవర్గాలు ఈ సమస్యపై పట్టించుకోకపోవడంతో పరిస్థితిదారుణంగా తయారైంది. చుట్టూ చెత్త, దుర్గంధంతో దహనం చేయడానికి వచ్చే వారు అనేక ఇబ్బందులు పడేవారు. కనీసం కూర్చోవడానికి షెడ్డుగాని, దహన సంస్కారాలు, స్నానాలు చేయడానికి సౌకర్యాలు లేవు. ఇక వర్షం వస్తే పరిస్థితి దారుణం. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుమార్గం కూడా పాడవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రూ.1.98 కోట్లతో నిర్మాణం

ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవతో శ్మశాన వాటికను స్మృతివనంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి పనులు మొదలు పెట్టారు. వేగంగా పనులు పూర్తి చేసి మహాప్రస్థానంగా నామకరణం చేశారు. దహన సంస్కారాలు కోసం బయో గ్యాస్‌తో మండే చితిని, పక్కన పుల్లలతో కాల్చే చితిని వేర్వేరుగా నిర్మించారు. రెండు షెడ్లులు, చుట్టూ ప్రహరీ, గోదావరి వద్ద ప్రత్యేకంగా స్నానాల రేవు నిర్మించారు. శ్మశానవాటికకు వచ్చే రోడ్డును నిర్మించారు. పక్కనే ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి అందులో దహనసంస్కారాలకు వచ్చేవారు కూర్చోవడాని సిట్టింగ్, అలాగే మంచినీటి సదుపాయం ఏర్పాటు చేసే పనులు చేస్తున్నారు. పార్కులో పూలమొక్కలు, చెట్లు వేసి అందంగా తీర్చి దిద్దాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పనులు వేగంగా సాగుతున్నాయి.

ఇబ్బందులు లేకుండా నిర్మాణం



హిందూ శ్మశాన వాటికను రూ.1.98 కోట్లతో అభివృద్ధి చేశాం. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక శ్రద్ధ పెట్టి మాతో పనులు చేయించారు. పనులు పూర్తవ్వడంతో ఇటీవల మహాప్రస్థానాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించుకున్నాము. దహన సంస్కారం కోసం గ్యాస్ ఆధారిత యూనిట్‌ను ఏర్పాటు చేశాం. పక్కన అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేస్తాం.

–బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు మార్కెట్ పన్ను వసూళ్ల వేలం

నరసాపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీలో డైలీ మార్కెట్ పన్నుల వసూళ్లపై హక్కులు కల్పించేందుకు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తోన్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం జరగాల్సిన పాటను కలెక్టర్ అనమతి రాని కారణంగా వాయిదా వేసి నిర్వహిస్తున్నామని చెప్పారు. పాటలో పాల్గొనేవారు రూ.3 లక్షలు ధరావత్తు చెల్లించాలని, రూ.5 లక్షలు సాల్వెన్సీ చూపించాలని పేర్కొన్నారు.

కృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమలక ఏకాదశి సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలో బుధవారం ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి నూతన వస్త్రాల అలంకరణ, సహస్ర నామార్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం



పాతపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు



పాతపాడులో బ్రోచర్‌లు అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: మండలంలోని పాతపాడు గ్రామంలో బుధవారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజుతో ఉదయం గ్రామానికి చేరుకున్న వారికి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు లోకం నాని ఆధ్వర్యంలో నాయకులు మోటార్ సైకిళ్లతో ర్యాలీగా మొగల్తూరు, ముత్యాలపల్లి, కొత్తోట, కాళీపట్నం మీదుగా పాతపాడు గ్రామం రావడం పలువురిని ఆకట్టుకుంది. ఈ ప్రచారంలో నరసాపురం మున్సిపల్ చైర్మన్ బర్రి వెంకటరమణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఏఎంసీ చైర్మన్ గుత్తుల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీలు కై లా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు లింగం ఏసుబాబు, మంతెన పాండు, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి ఏసుబాబు, అందే భుజంగరావు, ఆంద్రాజు చల్లారావు, బందన పూర్ణ చంద్రరావు,సరిపల్లి సుబ్బరాజు, రామాని మహేష్ కొప్పాడ గున్నయ్య, కొప్పాడ ఉమామహేశ్వరరావు, రేవు నారాయణ మూర్తి, బర్రి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



ముసలమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠలో భాగంగా అమ్మవారికి కుంభం పోసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రు ప్రధాన వీధిలో శ్రీ పుంతలో ముసలమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, పోతురాజు స్వామి వారి రాట ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అర్చకస్వామి బ్రహ్మశ్రీ స్థభితి శ్రీనివాస్, అక్కిరాజు శర్మ శిష్య బృందం బ్రహ్మత్వంలో నారిన నారాయణస్వామి, తమ్మాకోట నరసింహరావు, వేంద్ర సింహాచలం, కడలి శ్రీను, సన్నిశెట్టి వెంకట ప్రసాద్ దంపతులతో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం గోపూజ నిర్వహించి గోదర్శనం చేశారు. అనంతరం ఆలయం ముందు కుంభం పోశారు. పోతురాజు స్వామి రాట ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామి వారి రాట ముందు కుంభం పోశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని, పోతురాజు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా యలగలమ్మ జాతర



యలగలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

యలమంచిలి: నేరేడుమిల్లి గ్రామంలోని యలగలమ్మ వారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జాతర చేశారు. జాతరలో గరగల నృత్యాలు, శక్తి వేషాలు, బుట్టబొమ్మలు, డీజే సౌండ్స్ ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. జాతర అనంతరం బుధవారం అమ్మవారిని మంగళవాయిద్యాలు నడుమ మెట్టినింటికి సాగనంపారు. సాయంత్రం భక్తులంతా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.


వైభవంగా కనకదుర్గా మల్లేశ్వరుని కల్యాణం




కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి యీవని వెం కట రామచన్ద్ర సోమయాజులు (ఘనపాటి) ఆచార్యత్వంలో దేవరకొండ భాస్కరశర్మ బ్రహ్మత్వంలో ఇరగవరం వేద పండితులు ఎదురు సన్నాహ ఉత్సవం నిర్వహించారు. అనంతరం గుమ్మళ్ల లక్ష్మీనారాయణ, పెద్దిలక్ష్మి దంపతులతో అమ్మవారి కల్యాణం జరిపించారు. కళ్యాణం అనంతరం భక్తులకు జాకెట్ ముక్కలు, కుంకుమ బరిణెలు, ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణం తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావలి శ్రీనివాసరావు, సభ్యులు రేలంగి నరసింహరావు, దాసరి దివ్య, గవర రవి, జి.అరుణకుమారి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మదనగోపాలుని కల్యాణం



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు



బల్లిపాడులో మదనగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధి గాంచిన బల్లిపాడు శ్రీమదన గోపాలస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. స్వామివారిని గరుడవాహనంపై, శ్రీరుక్మిణీ సత్యభామా అమ్మవార్లను గజవాహనంపై ఉంచి ఎదురు సన్నాహ గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పాలతో అలంకరించిన కల్యాణ మండపంపై స్వామివారి కల్యాణోత్సవ తంతును పెద్దింటి అనిల్‌కుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అపధర్మ రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై తిలకించారు. శ్రీస్వామి,అమ్మవార్లకు కారుమూరి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాలనుంచి వేలాదిమంది భక్తులు హాజరైయ్యారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్‌లు ధనుమూరి తాతాజీ, ఆకుల బులినాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మద్దాల శ్రీనివాస్, రంభ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రథోత్సవం

అత్తిలి: మండలంలోని రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాలస్వామి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కల్యాణం నిర్వహించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భక్తులు వేకువ జామునుంచే దర్శించుకున్నారు. తీర్థ మహోత్సవానికి హాజరైన వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమంలో తమ సేవలను అందజేశారు. అనంతరం నిర్వహించిన రథోత్సవం అందరినీ ఆకట్టుకుంది.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెనుగొండ: గ్రామాల్లోని అధికారులు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. బుధవారం ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు మండలాల సచివాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సి–విజిల్ యాప్‌లపై ప్రత్యేక సూచనలు చేశఋరు. నిబంధనలు ఎక్కడా అతిక్రమించకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా గ్రామాల అధికారులదేనని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.



అవగాహన కల్పిస్తున్న స్వామి నాయుడు

నరసాపురంలో..

నరసాపురం: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగిఉండాలని డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మలజ్యోతి అన్నారు. వైఎన్ కళాశాలలో బుధవారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువత ఓటు హక్కు కోసం దరాఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు



సూరంపూడిలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

ఇరగవరం: వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఇరగవరం మండలంకె కుముదవల్లి నుంచి 50 మంది, తూర్పు విప్పర్రు నుంచి 70మంది, సూరంపూడి నుంచి 40మంది, మొత్తం 190 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు నాయకులు, కార్యకర్తలు మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువ కప్పి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు అని తెలిపారు. పార్టీలో చేరిన వారంతా పార్టీని బలోపేతం చేయాడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీని గెలిపించుకొని రానున్న రోజుల్లో సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్‌లు రామయణం జగదీష్, కటారి చంద్ర మణి, కటారి రాంబాబు రాజు జాలి సుబ్బరావు, సొసైటి అధ్యక్షులు సైపురెడ్డి పెద్దిరాజు, మామిడిశెట్టి శ్రీను, సిరగం శ్రీను, ఆకుల రామ సుబ్బరాజు, గనిశెట్టి సూరిబాబు, చొడే జోషి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బూత్ కమిటీలే కీలకం



వైఎస్సార్ సీపీ బూత్ కార్యకర్తలతో మాట్లాడుతున్న బోడపాటి వీర్రాజు

తణుకు టౌన్: గ్రామ స్థాయిలో బూత్ కమిటీలే కీలకమని, ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలోని 21, 22 బూత్ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేసేలా ప్రచారం చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు, తణుకు నియోజకవర్గం నుంచి కారుమూరి వెంకట నాగేశ్వరరావును అత్యదిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఓటరు లిస్టుల పరిశీలన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పదో వార్డు 62–111వ బూత్ పదో వార్డు ఇంచార్జ్ అడ్డాల నరసింహారావు, పెనుగొండ ఆంజనేయులు బుధవారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ లిస్టులపై సర్వే చేశారు. ఓటర్‌లిస్టులో రెండు చోట్లు ఉన్నారా, స్థానికంగా ఉన్నారా, డోర్ నెంబర్‌లలో మార్పులు ఉన్నాయా తదితర విషయాలను ఓటర్లును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లపల్లి నాగలక్ష్మి, టిక్కలి ధర్మరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



ముత్యాలపల్లిలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

మొగల్తూరు: మండలంలోని పదోతరగతి పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా సాగాయి. బుధవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ద్వారా 851 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 820 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని, 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు.

జగనన్నను గెలిపించేందుకు మేము సిద్ధం

ఉండి: జగనన్నను మరోసారి గెలిపించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఉణుదుర్రు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. బూత్ నంబర్ 10లో బుధవారం మేము సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన వైఎస్సా ర్‌సీపీ నాయకులు గత ఐదేళ్లల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని గుర్తుంచుకుని ఆయనను మరోసారి ఆశీర్వదించాలని వారు కోరారు. మోసపూరిత వాగ్దానాలు చేసే వారి మాటలు నమ్మవద్దని, నమ్మితే ఇబ్బందులు తప్పవని వారన్నారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు కూనపరాజు వర్మ, గొర్రుముచ్చు సుందర్‌కుమార్, అల్లూరి అంజిరాజు,పైలా సత్యనారాయణ,కొండుబోయిన నాగసూరి,కటికిరెడ్డి సతీష్,గోపే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది వలంటీర్ల తొలగింపు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉండి మండలం ఉణుదుర్రు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు అభియోగాలు రుజువు కావడంతో 9 మంది వలంటీర్లను తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని తెలియజేసినా ఉణుదుర్రులో వలంటీర్లు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నట్లుగా ఫొటోలతో సహా రుజువు కావడంతో విచారణ అనంతరం వారిని విధుల నుంచి తొలగించామని పేర్కొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

భీమవరం: భీమవరం టూటౌన్ అంబేడ్కర్ కూడలి వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై యువకుడు దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.విజయ్‌కుమార్ అనే కానిస్టేబుల్ విధుల్లో ఉండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై రాంగ్ రూట్‌లో వెళుతుండగా ఆపేందుకు కానిస్టేబుల్ యత్నించాడు. అయితే ఆ యువకులు మళ్లీ తిరిగి వచ్చి కానిస్టేబుల్‌తో ఘర్షణకు దిగారు. గునుపూడికి చెందిన డి.దీప్ సాయి కానిస్టేబుల్‌ను చేతులతో కొట్టి, విధులకు ఆటంకం కలిగించడం, దాడి చేయడంపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై జీజే ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై యువకుడి అసభ్య ప్రవర్తన

ఉండి: మండలంలోని ఉణుదుర్రు గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై యండగండికి చెందిన యువకుడు ఓగిరాల చంటి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి గల్ఫ్ వెళ్లడంతో తాతయ్య ఇంటివద్ద ఉంటుంది. అయితే బాలికను ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా చంటి వెంటపడుతున్నాడు. మంగళవారం యువతి ఇంటి వద్ద ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి ఆమె చేయిపట్టుకున్నాడు. దీంతో బాలిక కేకలు వేయగా ఆమెను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాట వినకుంటే చంపుతానని ఆమెను బెదిరించాడు. ఇంతలోనే ఇంటికి వచ్చిన తాతయ్యతో బాలిక విషయం చెప్పింది. దీంతో బాలిక తాతయ్య పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి



లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం ఇస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్‌దేశాలైన ఉమన్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి అక్కడ హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందిన తన తల్లి మల్లేశ్వరి మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని పెంటపాడు గ్రామానికి చెందిన దినేష్, కుటుంబ సభ్యులు బుధవారం పట్టణంలో జరిగిన గల్ఫ్‌హెల్ప్ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ భౌతికకాయాన్ని ఇండియాకు రప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

వెండి కవచాల సమర్పణ



పెనుగొండలో మూల విరాట్ వాసవీ మాతకు వెండి కవచాలను సమర్పిస్తున్న భక్తులు

పెనుగొండ: పందలూరి సీతమ్మ ఆర్యవైశ్య సత్రం, దేవస్థానం సభ్యులు పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాతకు వెండి కవచాలను సమర్పించారు. బుధవారం ఉదయం ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వెండి కవచాన్ని సమర్పించారు. జై వాసవీ జైజై వాసవీ నామస్మరణతో ఆలయంలో హోరెత్తించారు.

యానాం మద్యం బాటిళ్ల స్వాధీనం

యలమంచిలి: పుదుచ్చేరి రాష్ట్రానికి (యానాం) చెందిన మూడు బీరు బాటిళ్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ చెప్పారు. చించినాడ వశిష్ట గోదావరి నది వంతెన వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారులో మూడు బీరు బాటిల్స్ ఉన్నాయన్నారు. వాటి లేబుల్స్ పరిశీలించగా పుదుచ్చేరి రాష్ట్రానికి చెందినవిగా గుర్తించినట్లు చెప్పారు. దీంతో మూడు బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

తాడేపల్లిగూడెం రూరల్: భారత రాజ్యాంగం ద్వారా సక్రమించిన ఓటు హక్కును ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఓటర్లను చైతన్య పరుస్తూ మెట్ట ఉప్పరగూడెంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఓటర్లలో నమ్మకం కలిగించేలా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం తీసుకొస్తామన్నారు. పీసీ రాజ్ మహదేవ్, ఎస్‌కే.జిలాని, సీఐఎస్ఎఫ్ ఏఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ తరపున కారుమూరి నాగేశ్వరరావును సత్కరించారు. మంతెన రామలింగరాజు, సుంకర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.